క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ గిరీశా

సదుం: సీజనల్ వ్యాధులపై గ్రామాలలో అవగాహన కల్పించాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీశా ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశావర్కర్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గర్భవతులు, రక్తహీనతకు గురైన వారిని గుర్తించి వారికి మంచి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణులు కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రులలో చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారి జానకి, సూపర్‌వైజర్ నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లకు పుస్తకాల పంపిణీ



పాఠశాలలకు పంపిణీ చేస్తున్న పుస్తకాలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని అన్ని పాఠశాలలకు మంగళవారం పులిచెర్ల ఎంఆర్‌సీ నుంచి పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రిని పంపిణీ చేసినట్లు ఎంఈఓ-2 పోకల తాతయ్య తెలిపారు. మండలంలో 2400 మందికి 2400 బ్యాగులు, 1646 బెల్టులు, 15,374 నోట్ బుక్స్, 2400 యూనిఫామ్‌లు, 11,612 పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు.

విద్యార్థుల జీవితాలతో 'కూలమి' చెలగాటం

రొంపిచెర్ల: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడటం తగదని పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షురాలు పూజిత రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె రొంపిచెర్లలో విలేకరులతో మాట్లాడారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 11 వేల మంది విద్యార్థుల మార్కులను తారుమారు చేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని విమర్శించారు. కొందరు ఫెయిల్ అయ్యామని కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నారని, దీనికి కారణం కూటమి చేతకాని పాలనేనని దుయ్యబట్టారు. విద్యార్థులకు అన్యాయం జరిగితే పోరాటాలకు వెనుకాడేది లేదన్నారు.

ప్రధానోపాధ్యాయులు బాధ్యతల స్వీకరణ

రొంపిచెర్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు ధనలక్ష్మి, బాలికల ఉన్నత పాఠశాలకు రమణ, ఉర్దూ ఉన్నత పాఠశాలకు సుజాత, పెద్దమల్లెల ఉన్నత పాఠశాలకు రవీంద్రనాథ రెడ్డి, బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలకు చిన్నయ్య ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

9న యోగాంధ్ర విజయవంతం చేయండి



యోగాంధ్ర నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ భవాని

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ సమీపంలో ఈనెల 9న సోమవారం నిర్వహించ తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలమనేరు ఆర్డీఓ భవాని ఆదేశించారు. మంగళవారం ఆమె బోయకొండ సమీపంలో స్థల పరిశీలన చేసి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం మండల పరిషత్‌ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. సుమారు 2 వేల మందితో యోగాంధ్ర నిర్వహణకు అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ కేశవ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి




వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలమ్మ

చౌడేపల్లె: మధ్యాహ్న భోజన తయారీ నిర్వాహకులకు మంగళవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెనూ ప్రకారం స్కూళ్లలో భోజనం తయారు చేసి పెట్టాలని, వంట ప్రదేశంలో ప్రమాదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ తిరుమలమ్మ, జిల్లా సీఆర్పీ జయలక్ష్మి కోరారు. అనంతరం వంట నిర్వాహకులు చేసిన వంటలను రుచి చూసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్ శంకర్, సీఆర్పీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

హామీలకు తూట్లు.. ప్రజలకు వెన్నుపోటు

- ఏడాదవుతున్నా సూపర్‌సిక్స్ హామీలు గాలికి
- హామీలు నెరవేర్చడం కష్టమేనని సీఎం ప్లేటు ఫిరాయింపు
- సంక్షేమ ఫలాలు అందక ఇబ్బందులు పడుతున్న పేదలు
- బాబు ష్యూరిటీ లేదు..భవిష్యత్తుకు గ్యారెంటీ అసలే లేదు
- నేడు వెన్నుపోటు దినం నిరసనలు



వెన్నుపోటు దినం

అధికారంలోకి రావడమే పరమావధిగా అడ్డగోలుగా హామీలు ఇవ్వడం, ఆపై ప్రజలను వంచించడంలో చంద్రబాబునాయుడిని మించిన వారు దేశంలోనే ఉండరని రాజకీయ పండితులు మాట. చంద్రబాబు గద్దెనెక్కిన ప్రతిసారీ ప్రజలకు ఇది అనుభవపూర్వకమే! ఈ పర్యాయం 'సూపర్‌సిక్స్'తోపాటు బాబు 'ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరిట 143 హామీలను గుప్పించిన కూటమి ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కుచ్చుటోపీ పెట్టింది. "ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తోంది.. సూపర్‌సిక్స్‌ను అమలు చేయడం కష్టమేనంటూ'' సీఎం చంద్రబాబు అసెంబ్లీలో నాలుక మడత తిప్పడంతో ప్రజలు అవాక్కయ్యారు. బాబు హామీలతో తమ చెవుల్లో పూలు పెట్టారని జనం శాపనార్థాలు పెట్టని రోజంటూ లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలలో 98శాతం నెరవేరిస్తే, కూటమి కేవలం పింఛన్ల హామీ మాత్రమే నెరవేర్చి, దగా చేసిందని దుమ్మెత్తి పోస్తున్నారు.

పలమనేరు: ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు హామీలతో ఊదరగొట్టారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికెళ్తుంటే వారిందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, రైతులకు ఏటా రూ.20వేలు, 20లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగభృతి, ఏటా మూడు సిలిండర్లు ఉచితం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం..ఇలా ఊరూరా ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను అటకెక్కించారు. ఓ వైపు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సన్నాహాల్లో పడ్డారు. అయితే పెట్టుబడికి డబ్బుల్లేవు. బడులు తెరుచుకుంటున్నాయి దీంతో తల్లిదండ్రులకు కష్టాలు తప్పడం లేదు. ఫ్రీ బస్సు ఎప్పుడో తెలియడం లేదు. నిరుద్యోగులకు కుచ్చుటోపీ పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెప్పిన తేదీకి క్యాలెండర్‌లా పథకాలు అమలు చేస్తే దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఉందని ప్రజలు మండిపడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో పొందిన లబ్ధి		
పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం రూ.కోట్లు
జగనన్న విద్యా దీవెన	21,789	54.06
జగనన్న వసతి దీవెన	16,937	25.99
రైతులకు పంటల బీమా	20,063	9.51
సున్నావడ్డీ పంట రుణాలు	7,591	2.13
ఇన్‌పుట్ సబ్సిడీ	5911	3.05
మహిళలకు చేదోడు	2201	4.81

రైతులకు రూ.907 కోట్ల సాయం ఎప్పుడో..?

నియోజకవర్గంలో 45,396మంది రైతులున్నారు. వీరికి గత ప్రభుత్వం పాలనలో 'రైతు భరోసా' కింద పెట్టుబడి సాయంగా రూ.225కోట్ల లబ్ధి పొందారు. ఇప్పుడు కూటమి పాలనలో ఒక్కో రైతుకు ఏటా రూ.20వేల చొప్పున రూ.907కోట్ల వరకూ ఇవ్వాల్సి ఉంది.

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటి నుంచో..!

నియోజకవర్గంలో ఉచిత బస్సు ప్రయాణానికి 1,85,242మంది మహిళలు అర్హులుగా ఉన్నారు. వీరికి ఎప్పటి నుంచి ఈ పథకం అమలవుతుందో ఇంకా స్పష్టత లేదు.

పలమనేరు నియోజకవర్గంలో ... వందనం కాదు..తల్లికి ఎగనామం!

వైఎస్సార్‌సీపీ పాలనలో 'అమ్మ ఒడి'కి సంబంధించి 40,100మంది తల్లులు రూ.165.19 కోట్ల లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం ఇదే పథకానికి పేరు మార్చి, 'తల్లికి వందనం' అంటూ ప్రకటించింది. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు, ఇంటర్‌తో కలిపి విద్యార్థుల సంఖ్య 65వేలకు చేరింది. అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్నా వీరికి ఏటా రూ.15వేల ఊసే లేదు. దీంతో తల్లులు తమకు చంద్రబాబు ఎగనామం పెట్టారని రుసరుసలాడుతున్నారు.

నెలకు రూ.1,500 కూడా అంతేనా?

ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో 1.31లక్షల మంది మహిళలున్నారు. వీరికి నెలకు రూ.19.6 కోట్లు కావాలి.

నిరుద్యోగ భృతి ఊసే లేదు

నియోజకవర్గంలో 37వేల మంది నిరుద్యోగులున్నారు. వీరికి కూటమి చెప్పినట్టు నెలకు రూ.3వేల చొప్పున ఇవ్వాలంటే రూ.11కోట్లు కావాలి. మరోవైపు 20లక్షల ఉద్యోగాల మాట దేవుడెరుగు గత ప్రభుత్వంలో ఇక్కడ 110 సచివాలయాల్లో 1200 మందికి ఉద్యోగం లభించింది.

మూడు నియోజవర్గాలోనే 'వెన్నుపోటు దినం'

చౌడేపల్లె(పుంగనూరు)/పలమనేరు/కుప్పం: పుంగనూరులో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించనున్నారు. ఈ దిశగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోవడంపై పలమనేరు ఆర్డీఓ కార్యాలయం వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహణకు సన్నద్ధమయ్యారు. బుధవారం ఉదయం బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు.

సూపర్ సిక్స్ ఎప్పుడో..?



సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. గత ప్రభుత్వం మార్చిలోనే రైతు భరోసా ఇచ్చేది. తొలి వర్షాలకు రైతులకు సకాలంలో రాయితీ విత్తనాలు వచ్చేవి. ఈ సమయానికి రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా ఉండేవారు. ఈ ఏడు విత్తనాలు ఎప్పుడు ఇస్తారా? అని ఎదురు చూడాల్సి వస్తోంది.

–అజయ్, దాసేగౌనూరు, కుప్పం మండలం

ఇచ్చేది ఆ దేవుడికే ఎరుక



మాది పేద కుటుంబం. నా కుమార్తె 4వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పేరిట రూ.15 వేలు వచ్చింది. ఇప్పుడు తల్లికి వందనం ఇస్తామన్నా ఏడాదిగా ఆ జాడే లేదు. అదిగో..ఇదిగో అంటున్నారు తప్పితే ఎప్పుడు ఇస్తారో దేవుడికే ఎరుక. సూపర్ సిక్స్ పథకాలన్నీ ఇంతే!

రంజిత్, ఊరునాయునిపల్లె, కుప్పం మండలం

సేద్యం సీజన్ మొదలైనా అందని సాయం



సేద్యం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. చేలల్లో వేరుశనగ విత్తనాలేయాల. టీడీపీవోళ్లు చెప్పినట్టు రైతుకు 20 వేల సాయం ఎప్పుడిస్తారో? అనేది ఇప్పటికీ అనుమానంగానే ఉంది. ముందు ప్రభుత్వంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలబీమా ఇచ్చినారు. ఇప్పుడేమో ఏదీ అందడం లేదు. ఇట్లా ఉంటే రైతులేం గావాల?

–చంద్రప్ప, రైతు, ఎర్రినాగేపల్లె, వీ.కోట మండలం

ఆర్టీసీలో ఉచిత ప్రయాణమెప్పుడో..?



ఎన్నికలప్పుడు టీడీపీ నాయకులు ఇళ్లకాడికొచ్చి ఆర్టీసీ బస్సుల్లో మాకంతా ఫ్రీ అని చెప్పిరి. మా ఆడోళ్లంతా ఎంతో సంతోషపడితిమి. నాయకుల మాట నమ్మి మా పక్కనే ఉన్న కర్ణాటకలో మాదిరిగా చేస్తారేమో అనుకుంటిమి. ఇప్పుడు సూస్తే ఇంకా ఏమీ లేదు. చంద్రబాబు బస్సుల్లో ఫ్రీ పెట్టాల్సిందే.

–మంజుల, సదుం మండలం

రైతు సంక్షేమం పట్టని చంద్రబాబు



ఎన్నికల ముందు చంద్రబాబు రైతుల కోసం ఎన్నో హామీలిచ్చారు. కానీ సీఎం అయ్యాక అస్సలు పట్టించుకోవడమే లేదు. ప్రతి రైతుకూ 'అన్నదాత సుఖీభవ' పథకం పేరిట పెట్టుబడి సాయంగా సంవత్సరానికి రూ.20వేలిస్తామన్నారు. ఇంతవరకూ ఒక్క రూపాయీ ఇవ్వలేదు. వేరుశనగ విత్తనాలు ఏసేదానికి డబ్బుల్లేవు. బాబు హామీ నిలబెట్టుకోవాలి.

గౌరప్ప, కొత్తబూరగపల్లె, పెద్దపంజాణి మండలం

ప్రజలకు ఒరిగిందేమీ లేదు



ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సూపర్ సిక్స్ హామీలతో దగా చేశారు. అదే గత జగనన్న ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాదిలోనే నెరవేర్చింది. ఇవ్వనీ వాటిని చేతల్లో చూపింది. కూటమి ప్రభుత్వం మాత్రం ఉద్దేశపూర్వకంగా హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తోంది.

–విజయ్, దళిత సంఘం నాయకుడు, బొమ్మనపల్లె, గంగవరం మండలం

ఒక్క రూపాయీ ఇవ్వలా..!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంతవరకు ఒక్క రూపాయి సాయం కూడా చేయలేదు. గత ప్రభుత్వ పాలనలో నాకు డ్వాక్రా రుణ మాఫీ చేశారు. రైతు భరోసా సాయం ఐదేళ్లు ఇచ్చారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోంది. పంటల సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

–కె.రమణమ్మ, కల్లావారిపల్లె, రొంపిచెర్ల మండలం

మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు


- పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

చౌడేపల్లె (పుంగనూరు): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పుంగనూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై సభ్యులు మాట్లాడారు. మండలంలో ప్రధానంగా విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, పలు ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నా అధికారులు సకాలంలో స్పందించడం లేదని మండిపడ్డారు. మరోవైపు విద్యుత్ లైన్ల ప్రమాదాల బారిన పడి ప్రజలు చనిపోతున్నారని నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మండల నిధుల నుంచి రూ.1.20 కోట్లు కేటాయించామన్నారు. అలాగే అభివృద్ధి పనులకు ఎంపీ నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు తమ ప్రాంతాల సమస్యలను గుర్తించి నివేదికలు ఇవ్వాలని, వీటి పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారన్నారు. కొంత మంది అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ లీలామాధవి, తహసీల్దార్ రాము, వైస్ ఎంపీపీలు సరోజమ్మ, ఈశ్వరమ్మ, కో–ఆప్షన్ మెంబర్ బాబ్‌జాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈద్గా మైదానం పరిశీలన



పుంగనూరులో ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న సీఐ

చౌడేపల్లె (పుంగనూరు): ఈనెల 7న బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ సుబ్బరాయుడు కోరారు. మంగళవారం ఎన్ఎస్.పేటలోని ఈద్గా మైదానాన్ని ఆయన అంజుమన్ కమిటీ పెద్దలు ఇబ్రహీం, జాఫర్‌తో కలసి పరిశీలించారు. పట్టణంలోని ముస్లింలు ర్యాలీగా వెళ్లి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న నేపథ్యంలో సీఐ ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు.

• విశ్వరూప దర్శనం



భక్తులకు విశ్వరూప దర్శనమిస్తున్న గంగమాంబ



ఆలయంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వి.కోట: పట్టణంలో గంగమాంబ జాతరలో భాగంగా మంగళవారం అగ్నిగుండ ప్రవేశం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయం వద్ద వందలాది మంది భక్తులు అగ్నిప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పట్టణం నుంచి భక్తులు దీపాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణంలో భక్తులు పూలగెరిగతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులకు తీర్థ,ప్రసాదాలు, అంబలి, శీతల పానీయాలు, మజ్జిగ ప్యాకెట్లను ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అలాగే, మాజీ సర్పంచ్ పీఎం బసప్ప జ్ఞాపకార్థం ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ప్రత్యేకించి చిన్నారులతో నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

హాస్టళ్లలో చేర్చాలని వార్డెన్ల ప్రచారం



గ్రామాల్లో ప్రచారం చేస్తున్న హాస్టల్ వార్డెన్లు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలున్నాయని, పేదపిల్లలను హాస్టళ్లలో చేర్చాలని పలమనేరులోని హాస్టల్ వార్డెన్లు సోమవారం నియోజకవర్గంలో పలు గ్రామాలలో తల్లిదండ్రులను కోరారు. పెద్దపంజాణి మండలంలోని నాగిరెడ్డిపల్లె, వేమనపల్లె, చాడిరెడ్డిపల్లె, కురప్పల్లె, నిడిగుంట, దండపల్లెలో ప్రచారం చేశారు. పలమనేరు ఎస్సీ హాస్టల్ 70 ఖాళీలున్నాయని, ఆసక్తి ఉన్న పిల్లలు చేరాలని కోరారు. హాస్టళ్లలోని వసతులు, సౌకర్యాలు, భోజనం, వైద్య పరీక్షల గురించి తెలియజేశారు. ప్రచారంలో వార్డెన్లు మధుసూదన్ రెడ్డి, రాజేష్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

• రేపటి నుంచి విత్తనాల పంపిణీ



సదుం: మండలంలో రాయితీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఏఓ మాధవి తెలిపారు. 920 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కే–6 రకం 30 కిలోల బస్తా రూ.1674, నారాయణి 30 కిలోల బస్తా రూ. 1710గా నిర్ణయించామన్నారు. పంట సాగు చేసే వారు మాత్రమే కాయలు తీసుకోవాలని, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకంతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

• శాంతిపురంలో...

శాంతిపురం:మండలంలో రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీకి గురువారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసి, శుక్రవారం నుంచి పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి అప్సోజి తెలిపారు. బుధవారం ఉదయం అబలకదొడ్డిలోని రైతు సేవా కేంద్రంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విత్తన పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. 5న సొన్నేగానిపల్లె, మఠం, ఎంకె పురం, అబకలదొడ్డి, కొలమడుగు, కడపల్లెలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసి 6న విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

• నేడు డయల్ యువర్ డీఎం

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారం నిమిత్తం బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక డీఎం టీకే స్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల లోపు 9959225678 సెల్ నంబర్‌కు సమస్యలను ఆర్టీసీ ప్రయాణికులు తెలియజేయాలని కోరారు.

విత్తనాల పంపిణీకి రెడీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న విత్తనాలు

గుడుపల్లె: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ కాయల విత్తనాలు బుధవారం నుంచి ఆయా రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని 570 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుకుగాను 420 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. 30 కిలోల వేరుశనగ బస్తా 40 శాతం రాయితీ పోను 1674 రూపాయలను చెల్లించి పొందవచ్చన్నారు. రైతులు ఆయా కేంద్రాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తెచ్చి బయోమెట్రిక్ ద్వారా విత్తనాలు పొందవచ్చన్నారు.

వర్సిటీలో 'వృక్ష సంహారం'

- శ్రీనివాస వనంలో మాయమవుతున్న చెట్లు



ట్రాక్టర్లలో తరలిపోతున్న ఆకేష దిమ్మెలు

గుడుపల్లె: ద్రావిడ విశ్వవిద్యాలయంలో పదిహేనేళ్ల క్రితం తిరుమల–తిరుపతి దేవస్థానం నాటిన ఆకేష మొక్కలు ప్రస్తుతం పెరిగి మహావృక్షాలనాయి. దీనిపై కన్నేసిన వర్సిటీ అధికారులు ఆదాయం కోసం చెట్లను మాయం చేస్తున్నారు. పచ్చదనం పెంచాల్సిన అధికారులే అడ్డదారులు తొక్కుతూ ప్రైవేట్ వ్యక్తులకు వీటిని విక్రయిస్తున్నారు. దీంతో పచ్చదనం తరిగి శ్రీనివాసవనం మైదానంగా మారుతోంది. అప్పట్లో టీటీడీ వేలాది మొక్కలు నాటి వాటికి శ్రీనివాసవనం అని పేరు పెట్టింది. ఆ మొక్కలు కాస్తా కాలక్రమంలో భారీ వృక్షాలు అయ్యాయి. ఫలితంగా చల్లదనాన్ని, నీడను పంచుతున్నాయి. వేసవిలో విద్యార్థులు వాటి నీడలో సేదదీరడం పరిపాటి. అయితే అధికారులు నిబంధనలకు నీళ్లొదిలి, పచ్చదనాన్ని హరిస్తున్నారు. ఆదాయం కోసం చెట్లను విక్రయించారు. పచ్చని చెట్లను కొట్టివేసి, ట్రాక్టర్లలో చెట్ల దుంగలను తరలిస్తున్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు దీనిపై మండిపడుతున్నారు. చెట్ల నరికివేతపై వర్సిటీ డీఈ రఘునాథ్‌ను వివరణ కోరగా..వర్సిటీలోని చెట్లను వేలం వేశామని, దాని ప్రకారం వారు తీసుకెళ్తున్నట్లు వివరణ ఇచ్చారు.

వైభవంగా ఇంద్రవరదుని రథోత్సవం



యాదమరి: వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా కీలక ఘట్టమైన రథోత్సవం భక్త జనం కోలాహలం మధ్య నారాయణుని సంకీర్తనలతో వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాలలో కీలకమైన రథోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కాస్త ఆలస్యంగా రథోత్సవం ప్రారంభమైనా భక్తులు నిరీక్షించి స్వామి సేవలో తరించారు. ముందుగా ఉత్సవమూర్తిని సుగంధ భరిత పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేద పండితులు పారాయణం చేస్తుండగా స్వామి వారు రథంపై అధిరోహించారు. భక్తుల కోలాహలం మధ్య ఇంద్రవరదుని రథోత్సవం ఒక్కో అడుగుతో ముందుకు సాగింది. అంతకు ముందు మూలవర్లకు పుష్ప కైంకర్యం నిర్వహించారు.